క్లుప్తంగా

క్యాలెండర్ ఆవిష్కరణ

కడప కార్పొరేషన్: రక్షణ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు పల్లెకొండు సంపత్, చైతల్య ఆధ్వర్యంలో రూపొందించిన 2024 నూతన సంవత్సర క్రిస్టియన్ క్యాలెండర్లను శాప్ డైరెక్టర్ డేనియల్ ప్రదీప్ ఆవిష్కరించారు. మంగళవారం స్థానిక ద్వారకా నగర్‌లోని ఆయన స్వగృహం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు శ్యాంసన్, విన్సెంట్, సుమంత్, కిరణ్ సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

రైతు సంఘం క్యాలెండర్

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: ఏపీ రైతు సంఘం ముద్రించిన నూతన సంవత్సరం 2024 క్యాలెండర్‌ను మంగళవారం జిల్లా వ్యవసాయ శాఖ అధికారి నాగేశ్వరరావు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అగ్రికల్చర్ జేడీ ఆఫీస్ ఏఓ కృష్ణ సుమంత్ రెడ్డి, జిల్లా రైతు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు దస్తగిరి రెడ్డి, గోపాలకృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి పోరాటం

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : దేశ సమైక్యత కోసం, సమస్యల పరిష్కారానికి పోరాటాలు చేస్తామని సీపీఐ జిల్లా కార్యదర్శి జి.చంద్ర పేర్కొన్నారు. మంగళవారం సీపీఐ వార్షికోత్సవం సందర్భంగా నగరంలోని హోచిమన్ భవన్‌లో సీపీఐ జెండాను ఆవిష్కరించి కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు సుబ్రమణ్యం, బషీరున్నీషా, విజయలక్ష్మి, వేణుగోపాల్, వెంకట శివ, కేసీబాదుల్లా సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఘన నివాళి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: కమ్యూనిస్టు ఉద్యమ నేత దాదా అమీర్ హైదర్‌ఖాన్ సేవలు మరువలేనివని ఆప్‌కీ ఆవాజ్ రాష్ట్ర అధ్యక్షుడు ఆరిఫ్ ఖాన్, రాష్ట్ర కార్యదర్శి మగ్బూల్ బాషా పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని ఆప్ కి ఆవాజ్ కార్యాలయంలో దాదా అమీర్ ఖాదర్ ఖాన్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆప్ కీ ఆవాజ్ నాయకులు రఫిక్ ఖాన్, అబిద్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

అభినందన



విద్యార్థినులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

వైవీయూ: జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా ఈనెల 24న విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించిన పోటీల్లో కడప ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు ప్రతిభ కనబరిచారు. రాష్ట్రస్థాయి పోటీల్లో 'ఈ–కామర్స్, డిజిటల్ వర్తక శకంలో వినియోగదారుల రక్షణ' అన్న అంశంపై తెలుగు, ఇంగ్లీషు, ఉర్దూ భాషలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో ప్రతిభ చాటారు. తెలుగుభాషలో ఎం. పోలమ్మ ప్రథమస్థానం, ఉర్దూభాషలో ఎస్. నూర్జహాన్ ప్రథమస్థానం, ఆంగ్లభాషలో సి.ఫరిదా తృతీయస్థానంలో నిలిచారు. వక్తృత్వపు పోటీల్లో నూర్జహాన్ ప్రథమ, సౌమ్య ద్వితీయ బహుమతులు సాధించారు. వీరిని మంగళవారం కళాశాలలో ప్రిన్సిపాల్ డా. వి. సలీం బాషా ఆధ్వర్యంలో సన్మానించారు.

అథ్లెటిక్స్‌లో ప్రతిభ

వైవీయూ : కాకినాడలో ఈనెల 20వ తేదీన ఏపీ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ కంట్రీ చాంపియన్‌షిప్‌లో కడప ఆర్ట్స్ కళాశాల విద్యార్థి జి. సింహాచలం ప్రతిభ కనబరిచి పతకం సాధించాడు. సీనియర్ విభాగంలో పాల్గొని ప్రథమస్థానంలో నిలిచి జనవరి 14న బీహార్ రాష్ట్రంలో నిర్వహించే జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. కళాశాల విద్యార్థి జాతీయస్థాయి పోటీలకు ఎంపికడం పట్ల కళాశాల ప్రిన్సిపాల్ డా. జి. రవీంద్రనాథ్ అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డా. ఎం. రమేష్ పాల్గొన్నారు.

ఘన సత్కారం

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీఎస్ ఆర్టీసీ కడప జోన్ ఇన్‌ఛార్జి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన చెంగల్ రెడ్డిని ఎస్ఎంయూ నాయకులు కలిసి ఘనంగా సత్కరించారు. యూనియన్ నాయకులు మాట్లాడుతూ ఆర్టీసీ పురోభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామని, ఇదే క్రమంలో ఉద్యోగుల సమస్యలను ఈడీ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి తోడ్పాటు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జోనల్ కార్యదర్శి ఎం.చెన్నారెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు పీవీ శివారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి ఎం ఉభయతుల్లా, జోనల్ సహాయ కార్యదర్శి శ్రీరామ్ నాయక్, ఎంసి మెంబర్లు , సత్య సాయి జిల్లా , వైఎస్ఆర్ కడప జిల్లా , అనంతపురం జిల్లా, అన్నమయ్య జిల్లా నాయకులు, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ పోటీలకు నాగజ్యోతి

కడప స్పోర్ట్స్: కడప నగరానికి చెందిన జి. నాగజ్యోతి ఎస్‌జీఎఫ్ అండర్–19 తైక్వాండో జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. కడప నగరంలోని నారాయణ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్న ఈమె నవంబర్‌లో రైల్వేకోడూరులో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో చక్కటి ప్రతిభ కనబరిచింది. దీంతో ఈమెను జాతీయస్థాయి పోటీలకు ఎంపికచేశారు. త్వరలో మధ్యప్రదేశ్‌లో నిర్వహించనున్న జాతీయస్థాయి పోటీల్లో ఆమె పాల్గొననుంది.

ఆరోగ్యాంధ్రప్రదేశ్ ప్రభుత్వ లక్ష్యం



కమలాపురంలో క్రికెట్ ఆడి పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి



సీకేదిన్నెలో క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న జడ్పీటీసీ నరేన్ రామాంజులురెడ్డి

- ప్రభుత్వంతో పాటు సొంత నిధులతో ప్రోత్సాహకాలు
- ఆడుదాం ఆంధ్ర పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

కమలాపురం : క్రీడలతో శారీరక దారుఢ్యాన్ని, మానసిక ఉల్లాసాన్ని, ప్రశాంతతను పొందవచ్చని ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక బాలయోగి గురుకుల పాఠశాలతో పాటు చదిపిరాళ్లలో జరిగిన ఆడుదాం..ఆంధ్ర పోటీలను ఆయన బ్యాటింగ్ ఆడి ప్రారంభించారు. ముందుగా క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అనంతరం టాస్ వేసి ఇరుజట్లకు బ్యాటింగ్, ఫీల్డింగ్ అప్పగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ ప్రభుత్వం ఇలా క్రీడా పోటీలను ఏర్పాటు చేయలేదన్నారు. క్రీడలతోనే అందరికి ఆరోగ్యం లభిస్తుందని జగనన్న ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా ఐదు క్రీడాంశాల్లో పోటీలు నిర్వహిస్తున్నారన్నారు. ప్రతి అంశంలో కమలాపురం నియోజకవర్గ జట్టు రాష్ట్రస్థాయిలో రాణించాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రైజ్ మనీతో పాటు తన సొంత నిధులను జోడించి విజేతలకు ప్రైజ్ మనీ అందిస్తానన్నారు. ప్రభుత్వం రూ.35వేలు, రూ.15వేలు, రూ.5వేలు ప్రైజ్ మనీ ప్రకటించిందని, అయితే తాను మరో రూ.65వేలు, రూ.35వలు, రూ.20వేలు సొంత నిధులు జోడించి రూ.1లక్ష, రూ.50వేలు, రూ.25 వేల ప్రైజ్ మనీ ఇస్తున్నట్లు ప్రకటించడంతో క్రీడాకారులు హర్షం వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరు క్రీడా స్ఫూర్తితో ఆడాలన్నారు. నియోజకవర్గ, మండల స్పెషలాఫీసర్లు ఎదుభూషణ్‌రెడ్డి, నరసింహారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడా సొంత నిధులతో ప్రైజ్ మనీ ప్రకటించలేదని, మన ఎమ్మెల్యే ప్రభుత్వ ప్రోత్సాహకాలతో పాటు సొంత నిధులతో ప్రోత్సాహకాలు అందించడం హర్షణీయం అన్నారు. ఐదు అంశాల్లో ఆడే క్రీడాకారులు తప్పని సరిగా రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించాలని వారు ఆకాంక్షించారు. ఏపీడీ సోషేఖర్‌రెడ్డి, ఎంపీడీఓ జ్యోతి, నగర కమిషనర్ రాముడు, ఈఓపీఆర్‌డీ శారదారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

చింతకొమ్మదిన్నెలో..

చింతకొమ్మదిన్నె : మండలంలోని కృషి విజ్ఞాన కేంద్రం ఆవరణలోని క్రీడా మైదానంలో క్రికెట్ పోటీలను జడ్పీటీసీ పి.నరేన్ రామాంజులురెడ్డి ప్రారంభించి మాట్లాడారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎంతో నైపుణ్యం గల క్రీడాకారులను వెలికి తీసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆడుదాం ఆంధ్ర పోటీలను ఏర్పాటు చేశారన్నారు. మండల కన్వీనర్ గూడ ప్రభాకర్‌రెడ్డి, కో కన్వీనర్ కళా యాదవ్, మండల ఉపాధ్యక్షుడు గజ్జల సుధాకర్ రెడ్డి, మాజీ మండల కన్వీనర్ గుత్తిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ఎంపీటీసీలు వెంకటరెడ్డి పాల్గొన్నారు.

బీఈడీ కళాశాలలపై విచారణ చేయాలి

కడప ఎడ్యుకేషన్: వైవీయూ పరిధిలో ఉన్న బీఈడీ కళాశాలలపై విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని ఆర్‌ఎస్‌వైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శంకర్ డిమాండ్ చేశారు. ఆయన మంగళవారం కడప ఆర్‌ఎస్‌వైఎఫ్ కార్యాలయంలో విలేకర్ల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైవీయూ పరిధిలో 30 బీఈడీ కళాశాలలు ఉన్నాయన్నారు. ఈ విద్యా సంవత్సరం మరో 3 కళాశాలలు మంజూరు చేశారన్నారు. వీటిలో ఎక్కువ శాతం కళాశాలలు తరగతులను నిర్వహించకుండా, యూనివర్సిటీ నిబంధనలు పాటించకుండా, కనీస సౌకర్యాలు లేకుండా కళాశాలలను నిర్వహిస్తున్నారన్నారు. అలాంటి వాటిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఆర్థిక బకాయిల చెల్లింపు కోసం పోరుబాట

కడప ఎడ్యుకేషన్: ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావాల్సిన ఆర్థిక బకాయిలు తక్షణమే చెల్లించాలని కోరుతూ విజయవాడలో జనవరి 9,10 తేదీలలో 36 గంటల ధర్నా చేపడతున్నామని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మిరాజా, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయ్‌కుమార్, పాలెం మహేష్‌బాబు పేర్కొన్నారు. మంగళవారం కడప యూటీఎఫ్ భవన్‌లో జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి మెరుగ్గా ఉందని ప్రకటిస్తూనే మరో పక్క ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలు చెల్లించపోవడం తగదన్నారు. ఈ కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్, జిల్లా ట్రెజరర్ నరసింహారావు, జిల్లా కార్యదర్శులు సివిరమణ, ఎజాస్ అహ్మద్, రాష్ట్ర కౌన్సిలర్స్ చంగల్‌రాజు, అడిట్ కమిట కన్వీనర్ ప్రభాకర్ పాల్గొన్నారు.

రసవత్తరంగా బండలాగుడు పోటీలు

వీరపునాయునిపల్లె : కాశిరెడ్డి నాయన ఆరాధన మహోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన బండలాగుడు పోటీలు రసవత్తరంగా సాగాయి. ఈ పోటీల్లో 12 జతల ఎద్దులు పాల్గొన్నాయి. కడప జిల్లాకు చెందిన ఎద్దులే కాకుండా ఇతర జిల్లాల నుంచి కూడా వచ్చాయి. ఈ పోటీలను ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి ప్రారంభించారు.

– నంద్యాల జిల్లా ఎస్.కొత్తూరుకు చెందిన బీరం సుబ్రమణ్యేశ్వర్‌రెడ్డి ఎద్దులు మొదటి స్థానం, వైఎస్సార్ జిల్లా మాసనపల్లెకు చెందిన సాకం బ్రహ్మానందరెడ్డి ఎద్దులు రెండవ స్థానం, వైఎస్సార్ జిల్లా కీర్తిపల్లెకు చెందిన చిట్టిబోయిన భరత్‌కుమార్ యాదవ్ ఎద్దులు మూడవ స్థానం, వైయస్సార్ జిల్లా రంగసాయిపల్లెకు చెందిన మార్తల వెంకటసుబ్బారెడ్డి ఎద్దులు నాలుగవ స్థానం, వైఎస్సార్ జిల్లా సి.కొత్తపల్లెకు చెందిన మామిళ్ల సుబ్బారెడ్డి ఎద్దులు ఐదవ స్థానంలో నిలిచాయి. అలాగే వైఎస్సార్ జిల్లా కేశాపురానికి చెందిన చాగంరెడ్డి శివగోవిందురెడ్డి ఎద్దులు ఆరవ స్థానం, అనంతపురం జిల్లా ఎర్రగుంట్లకు చెందిన నిమ్మకాయల భాస్కర్ ఎద్దులు ఏడవ స్థానం, వైఎస్సార్ జిల్లా బెస్తవారిపల్లెకు చెందిన గాండ్లపెంట జతిన్ విహాన్ ఎద్దులు ఎనిమిదవ స్థానం, వైఎస్సార్ కడపజిల్లా నల్లయ్యగారిపల్లెకు చెందిన బొజ్జనబోయిన సాయితేజ యాదవ్‌కు ఎద్దులు తొమ్మిదవ స్థానం, వైఎస్సార్ జిల్లా పెద్దచీపాడుకు చెందిన తోగరచేటి వెంకటేశ్వర శర్మ ఎద్దులు పదవ స్థానం సాధించాయి. వీరికి ఆలయ ధర్మకర్త కటికం లక్ష్మిరెడ్డి బహుమతులు అందజేశారు. వరుసగా రూ. 50 వేలు, రూ.40వేలు, రూ.30వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు, రూ.8 వేలు, రూ. 6 వేలు, రూ.5వేలు, రూ.3 వేలు నగదును అందజేశారు.

ఎల్ఐసీ యూనియన్ నేతకు నివాళి



మాట్లాడుతున్న ఎల్ఐసీ ఉద్యోగుల సంఘం కడప డివిజన్ ప్రధాన కార్యదర్శి రఘునాథరెడ్డి

కడప కల్చరల్ : బీమా ఉద్యోగుల సంఘాన్ని, ఉద్యమాన్ని 36 సంవత్సరాలపాటు సమర్థంగా నడిపిన ఎస్ఎం సుందరంను మరిచిపోలేమని, నిత్యం స్మరించుకోదగిన మనిషి అని ఎల్ఐసీ ఉద్యోగుల సంఘం కడప డివిజన్ ప్రధాన కార్యదర్శి ఎ.రఘునాథరెడ్డి, పెన్షనర్స్ సంఘం ప్రధాన కార్యదర్శి కె.సుధీకర్ అన్నారు. మంగళవారం స్థానిక ఉద్యోగుల యూనియన్ కార్యాలయ ఆవరణలో యూనియన్ అధ్యక్షుడు అవధానం శ్రీనివాస్ ఆధ్వర్యంలో సంస్మరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎల్ఐసీలో గతంలో లేని పెన్షన్ సదుపాయం 1995లో అమలు కావడానికి సుందరం దార్శనికత, ధీరత్వం కారణమన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు అక్బర్ బాషా, అమీనా పర్వీన్, వారిజాతమ్మ, అయ్యవారు రెడ్డి , సజీరుల్లా, పద్మజాలత, రాజు, కుమార్, జయచంద్ర, రఘు, ముడియం కిషోర్, చంద్ర, నరసయ్య, ఎల్లయ్య, చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

అలరించిన కోలాటం



వీరపునాయునిపల్లె : పాలగిరి క్రాస్ రోడ్డు వద్ద వెలసిన కాశిరెడ్డి నాయన ఆలయంలో 28వ ఆరాధన మహోత్సవం మంగళవారం వైభంగా జరిగింది. సాయంత్రం ఏర్పాటు చేసిన తాళాల భజన, కోలాటం భక్తులను ఆకట్టుకుంది. అమ్మఒడి చారిటబుల్ ట్రస్ట్ అధ్వర్యంలో ప్రతిభ బయోటెక్ అధినేత ఇసుకపల్లె రాజశేఖర్‌రెడ్డి భక్తులకు అన్నదానం చేశారు. ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి, రాష్ట్ర మైనింగ్ డైరెక్టర్ వీరప్రతాప్‌రెడ్డి, మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి, ఎంపీటీసి సభ్యులు, సర్పంచులు పూజలు నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో యజ్ఞం



వల్లూరు : పుష్పగిరి రోడ్డులో వున్న శ్రీ గాయత్రీ తపో భూమి ఆశ్రమంలో మంగళవారం 24 కుండీల గాయత్రీ మహా యజ్ఞాన్ని వైభవంగా నిర్వహించారు. శ్రీ వేద మాత గాయత్రీ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో హరిద్వార్ బృందం గాయత్రీ యజ్ఞాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించింది.. భక్తుల చేతుల మీదుగా హోమ ద్రవ్యాలను సమర్పించి క్రతువు నిర్వహించారు. తీర్థ ప్రసాదాలను అందచేశారు. మధ్యాహ్నం అన్న దాన కార్యక్రమాన్ని నిర్వహించారు. గాయత్రీ మహా యజ్ఞ కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కడప నగరంలో అరుదైన సర్జరీ



సర్జరీ చేయించుకున్న జాఫర్‌తో డాక్టర్ జహంగీర్ బాషా

కడప రూరల్: కడప నగరంలోని జేబీ ఆసుపత్రిలో రివిజన్ నరాల మార్పిడి సర్జరీని విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఆ ఆసుపత్రిలో డాక్టర్ జహంగీర్ బాష వివరాలను తెలిపారు. కడప నగరానికి చెందిన జాఫర్ అనే వ్యక్తికి ఆరేళ్ల క్రితం మోకాలిలో ఏసీఎల్ నరం కట్ అయినందున వేరే ఆసుపత్రిలో ఆపరేషన్ చేయించుకున్నారని తెలిపారు. అతను ప్రమాదవశాత్తు కింద పడడంతో మళ్లీ నరం తెగి నడవలేకపోయారన్నారు. ఈ తరుణంలో ఆ వ్యక్తి తమ ఆసుపత్రికి రావడంతో వైద్య పరీక్షలు నిర్వహించామన్నారు. అనంతరం అరుదైన రివిజన్ ఏసీఎల్ సర్జరీని విజయవంతంగా నిర్వహించామని తెలిపారు.

వ్యాధిగ్రస్తుడు జాఫర్ మాట్లాడుతూ ఆపరేషన్ తరువాత అందరిలా తాను నడవగలుగుతున్నానని అన్నారు. ఆ ఆసుపత్రి సీఈఓ డాక్టర్ జయభారతి మాట్లాడుతూ తమ ఆసుపత్రిలో రివిజన్ కీళ్ల మార్పిడి, కీ హోల్ సర్జరీ, పాలిట్రామా, కాంప్లెక్స్ అండ్ ఫెయిల్డ్ ట్రామాల వైద్య సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

ఘనంగా శ్రీకాశిరెడ్డి నాయన ఆరాధన మహోత్సవం

లింగాల : మండలంలో వెలసిన శ్రీకాశిరెడ్డి నాయన ఆలయాలలో మంగళవారం ఆరాధనోత్సవాలను ఘనంగా నిర్వహించారు. స్థానిక శ్రీ అపర్ణాసిద్ధేశ్వరస్వామి ఆలయంలో కాశిరెడ్డి నాయన విగ్రహానికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించి ఆరాధనోత్సవాన్ని ప్రారంభించారు. ఉదయం నుంచి తాళాల భజనలు, చెక్క భజనలు, కోలాటలు భక్తులను అలరించాయి. సాయంత్రం జ్యోతులను ఎత్తి అర్ధరాత్రి జ్యోతి ప్రజ్వలన గావించారు. శ్రీసాయి ఈవెంట్ నెల్లూరు వారిచే నిర్వహించిన ఆర్కెస్ట్రా భక్తులను ఆకట్టుకుంది. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఇప్పట్ల, అక్కులగారిపల్లె, లోపట్నూతల గ్రామాల్లో కాశిరెడ్డి నాయన ఆరాధనోత్సవాలు ఘనంగా నిర్వహించారు.

పులివెందులలో...

పులివెందుల రూరల్ : మున్సిపాలిటీ పరిధి ఉలిమెల్ల గ్రామ సమీపంలోని వెంకటస్వామి తోటలో నిర్మించిన కాశిరెడ్డినాయన ఆలయంలో వార్షికోత్సవ వేడుకలు మంగళవారం వైభవంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ప్రతి ఒక్కరికి తీర్థ ప్రసాదాలను అందించారు. భక్తులకు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సదుపాయాలు కల్పించారు. సాయంత్రం పట్టణంలోని పురవీధులలో కాశిరెడ్డి నాయన చిత్ర పటాలను ట్రాక్టర్‌లో ప్రత్యేక పల్లకి ఏర్పాటు చేసి గ్రామోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.



ప్రత్యేక అలంకరణలో శ్రీకాశిరెడ్డి నాయిన

సమాజాభివృద్ధికి కృషి చేయాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : సమాజ అభివృద్ధికి యువత కృషి చేయాలని డీఆర్‌డీఏ పీడీ ఆనంద్ నాయక్ పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని డీఆర్‌డీఏ పీడీ కార్యాలయంలో డీవైఎఫ్ఐ ముద్రించిన 2024 నూతన క్యాలెండర్ ను ఆవిష్కరించారు. డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు చిన్ని, నగర అధ్యక్షుడు షాకీర్, జిల్లా ఉపాధ్యక్షుడు నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా దత్తాత్రేయ జయంతి



విశేష అలంకారంలో దత్తాత్రేయస్వామి

కడప కల్చరల్ : స్థానిక కో ఆపరేటివ్ కాలనీలోని శ్రీ షిరిడి సాయిబాబా మందిర ఆవరణలోగల దత్తాత్రేయస్వామి జయంతి ఉత్సవాన్ని మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఉదయం 4.00 గంటల నుంచి స్వామి మూలమూర్తికి రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం సాయి సత్యవ్రతాన్ని భక్తులచే సామూహికంగా నిర్వహింపజేశారు. నగరం నలుమూలల నుంచి భక్తులు విశేష సంఖ్యలో వచ్చి స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. కార్యక్రమానికి హాజరైన, వ్రతంలో పాల్గొన్న భక్తులందరికీ నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం అన్నదాన వితరణ జరిగింది.

మున్సిపల్ కార్మికుల సమ్మె



మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న కార్మికులు

కడప కార్పొరేషన్: మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం విధులు బహిష్కరించి సమ్మె చేపట్టారు. కార్పొరేషన్ కార్యాలయం ఎదుట బైఠాయించి ఆందోళన చేశారు. వారి సమ్మెకు సీఐటీయూ నగర ప్రధాన కార్యదర్శి సుబ్బయ్య, టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, జనసేన పార్టీ రాయలసీమ కన్వీనర్ సుంకర శ్రీనివాసులు, యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మిరాజా, యూటీఎఫ్ అన్నమయ్య జిల్లా అధ్యక్షులు హరి ప్రసాద్‌లు పాల్గొని మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ఇంజినీరింగ్ కార్మికులకు రిస్క్, హెల్త్ అలవెన్స్ ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో కడప మున్సిపల్ యూనియన్ నగర అధ్యక్షుడు సుంకర రవి, గోపి, కిరణ్, ఆనంద్, నాగరాజు, పెద్దన్న, కొండయ్య, ధరణి, సాయమ్మ, కొండమ్మ, శివ పాల్గొన్నారు.

బలిజ కాపుల సంక్షేమానికి వైఎస్సార్ సీపీ పెద్దపీట



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్వీ రాము

కడప రూరల్: బలిజ, కాపు వర్గానికి సముచిత స్థానం కల్పించింది వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీనే అని రాయలసీమ బలిజ సంక్షేమ ఐక్య పోరాట సమితి రాయలసీమ అధ్యక్షులు ఎస్‌వీ రాము అన్నారు. మంగళవారం స్థానిక ఆ సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కడప నగరంలో వైఎస్సార్‌సీపీకి మద్దతు ఇవ్వమని బలిజ సంఘం తీర్మానించడం విడ్డూరంగా ఉందని అన్నారు. ఇలా వ్యవహరించి వైఎస్సార్‌సీపీలోని బలిజ కార్యకర్తలను అవమానించినట్లైందని అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తన పాలనలో బలిజ, కాపుల ప్రయోజనాలకు పెద్ద పీట వేశారని తెలిపారు. వైఎస్సార్‌సీపీ రాయలసీమ జిల్లాల్లో బలిజలకు ఎంఎల్‌సీగా, మూడు జిల్లాల్లో అర్బన్ డెవలప్‌మెంట్ చైర్మెన్‌గా ఇలా ఎన్నో పదవులను కేటాయించి సముచిత న్యాయం కల్పించిందన్నారు. అలాగే డిప్యూటీ సీఎం అంజద్‌బాష, మేయర్ సురేష్‌బాబు బలిజ సోదరులకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారని అన్నారు. బలిజ కాపు వర్గీయులు ఎల్లప్పుడూ వైఎస్సార్‌సీపీకి అండగా ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షులు ఏ నరసింహులు, ప్రసాద్, సాంబశివయ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

30న ఉద్యమ సదస్సు

కడప రూరల్: ఈ నెల 30వ తేదీన కడప వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్‌లో ఉదయం 10 గంటలకు ఐక్య ప్రజాస్వామ్య ఉద్యమ సదస్సును నిర్వహించనున్నారు. ఈ సదస్సు జయప్రదం చేయాలని మహాజన రాజ్యం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు సంగటి మనోహర్ తెలిపారు. పార్టీలకు అతీతంగా నిర్వహించే ఈ సదస్సును జయప్రదం చేయాలని కోరారు.

ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి

కడప ఎడ్యుకేషన్: రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల శివార్జున పేర్కొన్నారు. మంగళవారం కడప ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘ కార్యాలయంలో ముఖ్య నాయకులు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు దాచుకున్న పీఎఫ్ రుణాలు చెల్లించడంలో ప్రభుత్వం ఆలస్యం చేస్తోందన్నారు. ఇంకా పలు సమస్యలు ఉన్నాయని, వాటిని ప్రభుత్వం పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సుదర్శన్, ప్రధాన కార్యదర్శి గంగరాజు, కార్యదర్శులు గంగాధర్, జయరాముడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దుర్గమ్మ సన్నిధిలో పూజలు

కడప కల్చరల్ : కడప నగరం శ్రీ విజయదుర్గాదేవి ఆలయంలో మంగళవారం భక్తులు దోష నివారణ కోసం రాహుకాల పూజలను నిర్వహించారు. తొలుత అమ్మవారి మూలమూర్తిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో సామూహికంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారికి నిమ్మకాయ దీపాలను వెలిగించి కోరికలు నెరవేరాలని మొక్కుకున్నారు.

ఉచిత శిక్షణ

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఉన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ట్యాలీ కోర్సులో శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు ఫౌండేషన్ అడ్మిషన్ కో ఆర్డినేటర్ హరిప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. టెన్త్, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ పాస్ లేదా ఫెయిల్ అయిన అభ్యర్థులు 18–26 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన వారు అర్హులన్నారు. 35 రోజులపాటు బెంగుళూరులో ఇచ్చే శిక్షణలో భోజన, వసతి సదుపాయాన్ని కల్పిస్తారన్నారు.

30న వేలంపాట

కడప కల్చరల్ : కడప నగర సమీపంలోని పాలకొండల్లోగల శ్రీ పాలకొండరాయస్వామి ఆలయానికి సంబంధించి తలనీలాల సేకరణ, టెంకాయల విక్రయ హక్కు వేలం పాట ఈనెల 30వ తేదీ ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నామని ఈఓ ఎ.శ్రీధర్ తెలిపారు. నగరంలోని శ్రీ మృత్యుంజయేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఈ వేలం పాట నిర్వహిస్తామన్నారు. డిపాజిట్, ఇతర వివరాల కోసం ఈఓ 7396354149ను సంప్రదించాలన్నారు.

రిటైర్డ్ ఉద్యోగులకు న్యాయం చేయాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీఎస్ ఆర్టీసీలో పనిచేస్తూ రిటైర్డ్ అయిన ఆర్టీసీ కార్మికులకు జీవనభృతికింద రూ. 8 వేలు చెల్లించేలా కృషి చేయాలని ఏపీఎస్ ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయిస్ ఉద్యోగుల సంఘం రీజినల్ సెక్రటరీ ఎల్.రఘునాథరెడ్డి కోరారు. మంగళవారం ఆయన ఈ మేరకు మేయర్ సురేష్‌బాబును కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

29న జీపు వేలం

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగరంలోని అర్బన్ ఐసీడీఎస్ ప్రాజెక్టులో 1984 మోడల్ మహేంద్ర జీపును ఈనెల 29వ తేది వేలం వేయనున్నట్లు అర్బన్ సీడీపీఓ సునంద తెలిపారు. ఆసక్తిగల వారు కడప నగరంలోని వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్ పక్కనగల ఐసీడీఎస్ అర్బన్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

అంగన్వాడీ సమస్యలను పరిష్కరించాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : అంగన్వాడీలు ఎదుర్కొంటున్న సమస్యలను సత్వరమే పరిష్కరించాలని డీవైఎఫ్ఐ నగర కార్యదర్శి ఓబులేసు డిమాండ్ చేశారు. కడప నగరంలోని ఐసీడీఎస్ అర్బన్ కార్యాలయం వద్ద మంగళవారం అంగన్వాడీలు నిర్వహిస్తున్న సమ్మెలో ఓబులేశు పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ నాయకురాళ్లు నాగలక్ష్మి, పద్మ, సంటిమ్మ, స్వర్ణ, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

శ్రీ సత్యదేవుని వ్రతం

కడప కల్చరల్ : కడప నగరం గడ్డిబజారులోని శ్రీ లక్ష్మి సత్యనారాయణస్వామి ఆలయంలో మంగళవారం శ్రీ సత్యనారాయణస్వామి వ్రతం నిర్వహించారు. ధనుర్మాసం పౌర్ణమి సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు విజయ్‌భట్టర్ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్వామికి విశ్వక్సేన పూజ, నవకలశ తిరుమంజన సేవ, తోమాలసేవ నిర్వహించారు. స్వామి, అమ్మవార్లను కనుల పండువగా అలకరించి ఆలయ మండపంలోని ప్రత్యేక పీఠంపై కొలువు దీర్చారు. హాజరైన భక్తులకు వ్రత విధానాన్ని వివరిస్తూ సామూహికంగా శ్రీ సత్యనారాయణస్వామి వ్రతాన్ని నిర్వహింపజేశారు. భక్తులతో ఆలయంలో సందడి నెలకొంది.

పీజీ అర్హతను మినహాయించాలి

కడప ఎడ్యుకేషన్: రాష్ట్రవ్యాప్తంగా ప్రస్తుతం జరుగుతున్న డిప్యూటీ ఈఓ పోస్టుల నియామక పరీక్షకు పీజీ అర్హతను మినహాయించాలని ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర నాయకులు సివి ప్రసాద్, జిల్లా నాయకులు చెంగల్‌రెడ్డి, అలీఖాన్, ఈశ్వరచంద్ర, వీరప్రసాద్, చంద్రశేఖర్‌రెడ్డి, రాజగోపాల్, సత్యనారాయణ విద్యాశాఖను కోరారు. ఇది ఇన్ సర్వీసు ఉపాధ్యాయులకు, నిరుద్యోగులకు ఆటంకం కల్గిస్తుందన్నారు. గ్రాడ్యుయేషన్, బీఈడీ విద్యార్హతలతోనే పరీక్షలకు అనుమతి ఇవ్వాలని కోరారు.